ప్రజాశక్తి

గురువారం 12 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

సాయం దక్కేనా?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గతనెల 31న కురిసిన అతి భారీ వర్షాలతో ముంపునకు గురైన పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం జిల్లాలో పర్యటించనుంది. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష అనంతరం పెదకాకాని, వెంకటకృష్ణాపురం, మంగళగిరి, తాడేపల్లి మీదుగా వెంకటపాలెంను సందర్శిస్తారు. పంటలు దాదాపు 10 రోజుల పాటు నీటిలోనే ఉండి పోవడంతో పూర్తి స్థాయిలో దెబ్బ తిన్నాయి. అయితే అధికారులు ప్రస్తుతం రూపొందించిన అంచనాలు, వాస్తవ నష్టానికి వ్యత్యాసం ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సాయం అందుతుందా లేదా అన్న అంశం చర్చనీయాంశంగా ▶ 2లో



పెదకాకాని మండలంలో దెబ్బతిన్న పైరు

పెదకాకాని మండలంలో దెబ్బతిన్న పైర్లను పరిశీలిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

అభివాదం చేస్తున్న జగన్

మీకూ ఇదే గతి పడుతుంది

గుంటూరు జైలులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను కలిసిన జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోపించారు. గుంటూరులోని జిల్లా జైలుకు బుధవారం వచ్చిన ఆయన మాజీ ఎంపి నందిగం సురేష్‌తో ములాఖత్ అయ్యారు. ఒక దళిత నేతపై అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టారన్నారు. టిడిపి ఆఫీసుపై దాడి కేసులో నందిగం సురేష్ ఎక్కడ ఉన్నాడు..? సిసి కెమెరాలో కన్పించాడా? అని ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి వేధించడం తగదన్నారు. టిడిపి ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, ఇదే తప్పుడు సంప్రదాయం ఒక సునామీ అవుతుందని, మీ నాయకులకు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. రెడ్‌బుక్ పెట్టుకోవడం ఎదో ఘనకార్యం కాదని, పాలన గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి పెట్టారని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సంబరాలు చేసుకున్న బోట్ల నిర్వాహకులు వైసిపి వారు అవుతారా? అని ప్రశ్నించారు. బ్యారేజీని ఢీకొట్టిన బోట్లన్నీ టిడిపి వారివేనని స్పష్టం చేశారు. అనంతరం ఎస్‌విఎన్ కాలనీలో నివశిస్తున్న క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని పరామర్శించారు. ఇటీవల టిడిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి కొన్ని రోజులుగా ఆయన మంచంలో ఉన్నారు. జగన్ వెంట రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, వైసిపి నాయకులు మందపాటి రామచంద్రరావు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, నూరి ఫాతిమా, మండేపూడి పురుషోత్తం తదితరులున్నారు. అంతకు ముందు జగన్‌ను చూసేందుకు వైసిపి అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరాగా వారికి అభివాదం చేసుకుంటూ ఆయన ముందుకు కదిలారు.

మేజర్ డ్రెయిన్‌తో డేంజర్

- ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర మురుగు కాల్వ
- సైడ్ వాల్ లేకపోవడంతో భయంభయంగా రాకపోకలు

ప్రజాశక్తి - పొన్నూరు

ఆలూరు రైల్వే గేటు ఎదురు ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర మేజర్ మురుగు కాల్వకు సైడ్‌వాల్ లేకపోవడంతో పొన్నూరు, నిడుబ్రోలు ప్రజలతో పాటు ఆలూరు, కొండముది తదితర గ్రామాల రైతులు, ప్రయాణికులు, విద్యార్థులు భయాందోళన గురవుతున్నారు. పొన్నూరు మండలం కొండముది గ్రామాల ప్రజలు పొన్నూరు పట్టణానికి వెళ్లడానికి నిడుబ్రోలు ట్రాఫిక్‌లో చుట్టూ తిరిగి వెళ్లకుండా క్యాబిన్‌పేట మీదుగా ఆలూరు రైల్వే గేటు గుండా వెళ్లటం వల్ల దురం తగ్గుతుంది. అయితే ఆలూరు రైల్వే గేటు ఎదురుగా అతి వెడల్పైన లోతుగా ఉన్న తుంగభద్ర మేజర్ మురుగు కాల్వకు సైడ్ వాల్ నిర్మాణం చేయకపోవడం వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం, ముప్పు వాటిల్లుతుందోనని స్థానిక ప్రయాణికులు, వాహన చోదకులు భయపడుతున్నారు. భారీ వర్షాలు కారణంగా వారం రోజులుగా ఈ కాల్వకు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు సత్వర అవసరమని, సైడ్‌వాల్‌ను నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

రవాణా ఛార్జీలపై ప్రతిష్టంభన

ఉచిత ఇసుక విధానంపై అస్పష్టత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని బాలరిష్టాలు వెంటాడుతున్నాయి. ఈనెల 11వతేదీ నుంచి కొత్త విధానం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు కాలేదు. 12వ తేదీ గురువారం నుంచి కొత్త విధానం ప్రకటిస్తారని చెబుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉచిత ఇసుక విధానం విఫలం కావడానికి రవాణా ఛార్జీలు అధికంగా వసూలు చేయడం, అనధికారికంగా స్థానిక నాయకులు వసూళ్ల పర్వంతో ఈ విధానం అభాసుపాలైంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడు కొంచెం ధర తగ్గిందే తప్ప ఉచితం ఏదీ లేదనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నూతన విధానం రూపకల్పనకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అయినా రవాణా ఛార్జీలపై ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది. కిలో మీటరుకు టన్నుకు రూ.7 చొప్పున తీసుకోవాలని లారీ యజమాలను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాక ఇందుకు కొన్ని ఆంక్షలు పెట్టింది. దీంతో రవాణాపై ఇంకా స్పష్టత రాలేదని లారీ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

రీచ్‌ల నుంచి నేరుగా తీసుకువెళ్లేందుకు ప్రస్తుతం అవకాశం లేదు. స్టాక్ పాయింట్‌ల వద్దకు టన్ను రూ.192, రూ.250 చొప్పున ఒక్కొ ▶ 2లో

రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

- 8 లో

క్యామెల్ జాతీయ ప్రదర్శనకు వర్సిటీ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్ మరియు చిత్ర ప్రదర్శనలో పాల్గొనేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో చివరి సంవత్సరం విద్యార్థి సోనుదాస్ ఎంపికయ్యారు. కర్ణాటక, హంపిలో నవంబర్ 25-29 తేదీల్లో ఐదు రోజులపాటు జరిగే క్యాంప్‌లో ఎంపిక చేసిన వర్ణచిత్రాలు వచ్చే ఏడాది జనవరిలో ముంబాయి జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనలో 80 కాలేజీల నుండి విద్యార్థులు పాల్గొననున్నారు. సోనుదాస్‌ను ఇన్‌ఛార్జి వీసీ గంగాధరరావు, ఫైన్‌ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ బి.శేఖర్‌బాబు, అధ్యాపకులు పి.దేవకాంత్ అభినందించారు.

'మీకు తెలుసా' అంటూ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - బెల్లంకొండ

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కోసం స్థానిక జెడ్‌పి పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ వ్యాధుల రావడానికి కారణాలు, నియంత్రణ మార్గాలను వివరించారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దన్నారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఆర్ట్ మందులు, అప్పుక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.కోమలి, హెచ్‌ఎం శైలజ, ఎఎన్‌ఎం యలమందమ్మ, అవుట్ రిచ్ వర్కర్స్ మునిషా, శేషు, సిహెచ్‌సి కౌన్సిలర్ నాగేశ్వరరావు, విహెచ్‌ఎస్ మెంటర్ శాంతివర్ధ, రీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా ఛార్జీలపై ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో ఒక్కో ధర నిర్ణయించినా గరిష్టంగా టన్ను రూ.1600 నుంచి రూ.2 వేల వరకు పడుతుందని వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ఉచిత ఇసుక విధానం వల్ల వినియోగదారులకు పాక్షిక ప్రయోజనాలు అందుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఇసుక కొనుగోలులో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా రవాణా ఛార్జీల భారం ఎక్కువగా ఉంటోంది. రీచ్‌ల వద్ద కాకుండా స్టాక్ యార్డుల వద్ద ఇసుక విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయి. ఈ స్టాక్ యార్డులకు దూరంగా ఉన్న ప్రాంతాలకు ఇసుక విక్రయాల ధర మరింత ఎక్కువగా ఉంటోంది. దగ్గర ప్రాంతాలకు టన్ను రూ.1500కు లభిస్తుంది. తక్కువ స్టాక్ యార్డుల వల్ల దూరం పెరిగి భారం మరింత పెరుగుతోంది. కొత్త విధానం వల్ల అయినా తమకు తక్కువ ధరకు ఇసుక లభిస్తుందోమోనని వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

నందిగంను మాట్లాడవద్దనడానికే ములాఖత్

ప్రజాశక్తి - వినుకొండ

మాజీ ఎంపీ నందిగం సురేష్ నోరు విప్పకూడదనే జగన్ ములాఖత్ రాజకీయం చేస్తున్నారని టిడిపి సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రజలు విపత్తులో ఉంటే సాధ్యమైన సాయం చేయాల్సింది పోయి మహావిధ్వంసానికి ప్లాన్ చేసి దొరికిపోవడంతో నిజాలు బయటపడకుండా ఉండేందుకే జగన్ పాట్లు పడుతున్నారని, పైగా వరద బాధితుల్ని పరామర్శించడం కంటే జైల్లోని మిత్రుల్ని కలుసుకోవడమే జగన్‌కు ముఖ్యమైందని చురకలంటించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీన నందిగం సురేష్‌ను జగన్ ములాఖత్‌లో కలవడంపై ఈ మేరకు కీలక వ్యాఖ్యానించారు. నాడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని నందిగం సురేష్ సోదరులు చేయలని దుర్మార్గం లేదని, ఇసుక అక్రమ రవాణతో పాటు అడ్డొచ్చిన వారిని చంపేస్తామంటూ బెదిరింపులకు గురి చేశారన్నారు. ఏ నాటికైనా జగన్ సహా అతడి బ్యాచ్ మొత్తం జైలుకు పోవడం మాత్రం ఖాయమన్నారు.

90 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం..

భూ వివాదంపై తహశీల్దార్‌కు సంగం జాగర్లమూడి రైతుల వినతి

ప్రజాశక్తి - తెనాలి

మండల పరిధిలోని సంగం జాగర్లమూడికి చెందిన దాదాపు 50 మంది రైతులు బుధవారం తహశీల్దార్ కెవి గోపాలకృష్ణను కలిశారు. 1930 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని, రిజిస్ట్రేషన్, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నా 2019లో దేవాదాయ శాఖ అధికారులు ఆ భూములు దేవాదాయ శాఖకు చెందినవిగా ప్రకటించారని వివరించారు. తదుపరి భూములు సాగు చేస్తున్న రైతులకు సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు ఆ భూములను దేవాదాయ శాఖ భూములుగా మార్చేశారని చెప్పారు. తమకు

న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తహశీల్దార్ స్పందిస్తూ రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు.

నిరాడంబరంగా వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిరాడంబరంగా జరిగింది. ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ 1976లో అప్పటి రాష్ట్రపతి ఫ్రకర్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన వర్సిటీ దినదినాభివృద్ధి చెందుతూ నేడు కొన్ని లక్షల మందికి డిగ్రీలను, కొన్ని వేల మందికి డాక్టరేట్ పట్టాలను అందించి రాష్ట్రస్థాయితోపాటు జాతీయంగానూ తన ఉనికిని చాటుకుందని చెప్పారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు వారి వారి శక్తి మేర కృషిచేసి వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు. విశ్వవిద్యాలయ పురోగతి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విగ్రహానికి

పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రెక్టార్ కె.రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సిహెచ్ స్వరూపారాణి, కె.వీరయ్య, ప్రమీలరాణి, సిద్ధయ్య, ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జవాబుదారీతనాన్ని పెంచేదే సమాచార హక్కు చట్టం

సమాచార హక్కు చట్టంపై పలు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జవాబుదారీతనాన్ని పెంచేదే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్ధేశమని అధికారులు అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : మండలంలోని కావూరు రైతు సేవాకేంద్రంలో ప్రజలకు, అధికారులకు వ్యవసాయ శాధికారి టి.శ్రీలత ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడం కోసం కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్లను నెలకొల్పారన్నారు. ఈ చట్టం దేశమంతా వర్తిస్తుందన్నారు. ఏ శాఖ సమాచారాన్ని అయినా ప్రజలు తెలుసుకునేలా ప్రశ్నించేలా ఈ చట్టం రూపొందించాలన్నారు. ఈ చట్టం కింద సమాచారాన్ని కోరదలుచుకున్న వారు ఇంగ్లీషులో లేక స్థానిక అధికార భాషలో రాతపూర్వకంగా, ఎలక్ట్రానిక్ రూపంలో నిర్ణీత రుసుంతో పాటు తమ అభ్యర్థనను పౌర సమాచార అధికారి లేదా సంబంధిత అధికార యంత్రాంగానికి పంపించాల్సి ఉంటుందన్నారు. ముద్రించినా లేదా టెక్స్ట్ రూపంలో గల పేపర్‌కు ప్రతి కాపీకి ఒక్కొక్క పేజీకి రూ.2 లేదా ఎలక్ట్రానిక్ నమూనాల సమాచారం అంటే ఫ్లాపీ అయితే రూ.50, సిడి రూ.100, డివిడి రూ.200 చెల్లించాలన్నారు రికార్డులను కార్యాలయ పనివేళల్లోనూ తనిఖీ చేసుకోవచ్చన్నారు. కనుక ప్రతి అధికార యంత్రాంగం, పౌరులు ఈ చట్టం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జిపి. శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ, పౌరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని ఈ చట్టం సామాన్యుడి హక్కు అని ఏవో ఆర్ రామారావు అన్నారు. ఈపూరు రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని ఎవరైనా అడిగినప్పుడు నెలరోజుల వ్యవధిలో వారికి వివరాలను అందజేయాలని వారు సంతృప్తి చెందనపుడు వారిని పిలిచి మాట్లాడాలని అవసరమైతే జిరాక్స్ కాపీల ద్వారా పూర్తి వివరాలను అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల : ప్రభుత్వ పాలన విధానాలను ప్రజలు సులువుగా అవగాహన చేసుకోవడానికి 2005-సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ డిడి శివకుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలోనే రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. శివకుమారి మాట్లాడుతూ ఈ చట్టం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. రూ.పదితో చలానా కడితే సంబంధిత శాఖల సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఈ చట్టం వాడుకలోకి రావడానికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి, సైంటిస్ట్ సైదా నాయక్ ఏవో ప్రవీణ్, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల : రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు, గ్రామస్థాయి అధికారులకు, ప్రజలకు, రైతులకు సమాచార హక్కు చట్టం-2005పై అవగాహనా సదస్సు నిర్వహించారు. తహశీల్దారు ఎమ్.భవానీ శంకర్, వ్యవసాయ శాఖ ఏవో అరుణ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న ఏ సమాచారాన్నైనా ఈ చట్టం కింద పొందగలిగే హక్కు ప్రజలకు ఉందన్నారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత జవాబుదారితనం తీసుకురావటం, అవినీతిని అరికట్టటం, ప్రభుత్వం వాటి విభాగాలు ప్రజలకు జవాబుదారీగా ఉండటం, సమాచారంలో పారదర్శకత ఉండడం సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్ధేశమన్నారు. ఏవో అరుణ సమాచార హక్కు చట్టం విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో మండల శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో టిడిపి, వైసిపి ఘర్షణ

ప్రజాశక్తి - ఈపూరు : మండలంలోని బొమ్మరాజుపల్లిలో వినాయక నిమజ్జనంలో వైసిపి, టిడిపి గ్రూపులు బుధవారం పరస్పర రాళ్లు రువ్వుకున్నారు. టిడిపికి చెందిన వారు ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఊరేగింపుగా వెళ్తుండగా వైసిపికి చెందిన వారి ఇళ్ల వద్దకు రాగానే కొందరు ఆకతాయిలు రాళ్లు విసరడంతో వివాదం మొదలైంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కూల్ డ్రింక్ సీసాలు విసురుకున్నారు. దీంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇది తెలిసిన ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు గ్రామానికి చేరుకొని ఇరు పక్షాలను చెదరగొట్టారు. నిమజ్జనాన్ని నిలిపివేయాలని చెప్పడంతో టిడిపికి చెందినవ ఆరు గ్రామ ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. కారంపూడి సిఐ టీవీ శ్రీనివాసరావు, వినుకొండ రూరల్ సీఐ ఎం.ప్రభాకర్‌రావు గ్రామానికి చేరుకొని పోలీస్ బందోబస్తు నడుమ నిమజ్జనాన్ని కొనసాగించారు. ఘర్షణలో నిమ్మల పద్మ, రమేష్‌కు గాయాలు కావడంతో ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సచివాలయంపై ఉన్న జగన్ ఫొటోను ధ్వంసం చేసిన క్రమంలో గొడవలు చెలరేగినట్లు గ్రామస్తులు తెలిపారు.

అటవీశాఖ అమరవీరులకు నివాళులు

ప్రజాశక్తి- మాచర్ల : అటవీశాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన ఉద్యోగులకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్థానిక అటవీశాఖ కార్యాలయంలో బుధవారం నివాళులు అర్పించారు. సబ్ డిఎఫ్‌వో విజయ మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి కాపాడేందుకు అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడాల్సి వస్తుందని, ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగాలు నిర్వర్తిస్తూంటారని అన్నారు. అడవులు క్షేమం గానే ఉంటేనే పర్యావరణం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సాయం దక్కేనా?

(మొదటి పేజీ తరువాయి)

మారింది. జిల్లాలో 83 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని నివేదిక రూపొందించారు. 9 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో నీళ్లున్నా నష్టం అంచనాలను మంగళవారమే ఖరారు చేశారు. పంట నష్టపరిహారంపై ప్రభుత్వం నుంచి విధానపరమైన ప్రకటన వెలువడకపోవడం వల్ల రైతుల్లో అయోమయం నెలకొంది. మళ్లీ పంటల సాగుకు కనీసం ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు నష్టపోయామని, ఒక సీజన్ పంట కూడా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు తొలగి, మళ్లీ పొలాన్ని సేద్యానికి సిద్ధం చేయాలంటే మరో 10 నుంచి 15 రోజులు పడుతుందని, ఇక అక్టోబరులో రబీ పంటలు వేసుకోవాల్సిందేనని రైతులంటున్నారు. ఇందుకు ఆర్థిక సాయంతో పాటు విత్తనాలు పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వ సాయం ఉండవచ్చునని తెలిసింది.

మిగతా శాఖలకు సంబంధించిన నష్టాలను కూడా కేంద్ర బృందానికి అధికారులు వివరించనున్నారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, మునిసిపల్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్ బికి చెందిన 303 కీలో మీటర్ల రహదారులు దెబ్బతిన్నాయని, వీటి తక్షణ మరమ్మతుల కోసం రూ.16.09 కోట్లు, దెబ్బతిన్న రహదారుల నిర్మాణం కోసం రూ.142 కోట్లు అవసరమని కేంద్ర బృందానికి వివరించనున్నారు. పంచాయతీరాజ్ శాఖలో 280 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయని ఇందుకోసం రూ.72.47 కోట్ల అవసరమని నివేదికలో కోరారు. ఇప్పటికే అధ్వానంగా మారిన రహదారులు వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీలకు సంబంధించి 42 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. 13801 ఇళ్లు దెబ్బతిన్నాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు మృతి చెందిన వారికి రూ.5 లక్షల చొప్పున, ఇళ్లు నీట మునిగిన వారికి రేషన్ సరుకులు అందించారు. కానీ రైతులకు, ఇళ్లకు ఇంకా పరిహారమేమీ ప్రకటించలేదు.

తాడికొండలో ఫాగింగ్

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండ సెప్టెంబర్ 11 దోమల నిర్మూలనే ధేయంగా ఫాగింగ్ నిర్వహిస్తున్నామని తాడికొండ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం తాడికొండలోని పలు కాలనీలో దోమల ఫాగింగ్ నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దోమలకు ఆవాసాలుగా ఉన్నాయని, ఫాగింగ్ చేశారన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	32,598
మిర్చి ఎగుమతి	:	30,198
మిర్చి నిల్వ	:	19,975

మిర్చి ధరలు

రూపాయలలో

334	7,500 - 15,500
నెం.5	9,000 - 15,500
273	10,000 - 13,500
341	8,000 - 16,000
సూపర్ 10	10,500 - 10,500
నాన్ ఏసి	
తేజ	7,500 - 18,600
బడిగి	8,000 - 14,500
దేవనూరు డీలక్స్	8,500- 15,500
తాలుకాయలు	4,500 - 12,000
ఏసి	
334	8,000 - 15,800
నెం.5	9,000 - 13,000
273	10,000 - 12,000
341	8,500 - 15,000
తేజ	8,000 - 18,500
బడిగి	8,500 - 13,500
దేవనూరు డీలక్స్	9,000- 15,000
తాలుకాయలు	5,000 - 11,000

దళితులకు కొమ్మెర్ల స్ఫూర్తి : మాజీ మంత్రి డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చుండూరు దళిత ఉద్యమంలో కొమ్మెర్ల అనిల్ కుమార్ ప్రాణ త్యాగం, దళిత పల్లె వీరులకు స్ఫూర్తి దాయకయమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన అనిల్ కుమార్ 33వ వర్ధంతి సభలో వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సభకు దళిత బహుజన ఫ్రంట్ ఖాతీయ ప్రధాన కార్య దర్శి మేళం భాగ్యరావు అధ్యక్షత వహించారు. అంబేద్కర్ భావజాలంతో దళితులు తమ జాతిని పునర్ నిర్మించుకోవాల్సి ఉందన్నారు. దళితులు తమ మధ్య ఉన్న సమస్యలని సానుకూలంగా పరిష్కారం చేసుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. దళితులు రాజకీయ నాయకత్వ స్థాయికి ఎదగాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయకుమార్ మాట్లాడుతూ చుండూరు దళిత ఉద్యమ స్ఫూర్తి తో సుప్రీంకోర్టులో హంతకులకు శిక్షలు వేసేంత వరకు న్యాయ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో దళితులుకు అండగా ఉండాలి అని కోరారు తొలుత కొమ్మెర్ల అనిల్ కుమార్ చిత్ర పటానికి, డా. బిఆర్.అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలతో నివాళులు అర్పించారు. 40 మంది దళిత పల్లె వీరులకు అవార్డులు ప్రదానం చేశారు. వివిధ సంఘాల నాయకులు జాలాది మోజెస్, ఇసుకపల్లి జయరాజ్, చంద్ర నాయక్, భూపతి సునీల్ కుమార్, పొందుగల ప్రకాష్, మేడిద బాబురావు, బత్తుల విల్సన్, కోడిరెక్క కోటిరత్నం, రెడ్డి రమణమ్మ, జయసుధ, సంకురి రాజారావు, సాతులూరి రామాంజనేయులు, నాతం హరిబాబు ,కోసనం రాము, బుర్తి నగేష్, నేలపాటి నాగ భూషణం, విప్పర్ల విజయ భాస్కర్ పాల్గొన్నారు

ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు సమాచారాన్ని అందించడమే సమాచార హక్కు చట్టం లక్ష్యమని పెదకూరపాడు డిప్యూటీ తహశీల్దారు నిర్మలాకృష్ణ అన్నారు. బుధవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి -పెదకూరపాడు

వృత్తి ధర్మాన్ని పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ సేవలు నిరూపమానమని టిడిపి జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ బుధవారం అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు పొందిన కాకాని వెంకటరమణను హైస్కూల్లో జ్ఞాపిక అందించి దుశాలువా కప్పి ప్రత్యేకంగా సత్కరించారు. విద్యారంగానికి రమణ అందిస్తున్న సేవలను మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, గళ్ళ బాబు, ముంతాజ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హిదయ తుల్లా ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి, సన్మాన గ్రహీత రమణపై ప్రజాకవి దర్శి శేషారావు కవితా కవనం చేశారు.

వరద బాధితులకు డ్వాక్రా మహిళల చేయుత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ పొదుపు సంఘాల మహిళలు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా రూ 1.20 లక్షల చెక్కను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకి గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట 2వ పట్టణ పొదుపు సంఘం అధ్యక్షురాలు షేక్ అఖిల పొదుపు సంఘ మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బొక్క ఇస్సాకు, అతని భార్య కుమారిలు బుధవారం ఉదయం వేకువ జామునే ద్విచక్ర వాహనంపై నరసరావుపేట నుండి గుంటూరుకి బయలుదేరారు. మార్గమధ్యలో సాతులూరు గ్రామం సెంటర్లో స్పీడ్‌బ్రేక్ వద్ద ఉన్నట్టుండి బ్రేకు వేయడంతో అతని భార్య ఒక్కసారిగా ఎగిరి రోడ్డుపై పడిపోయింది. దీంతో తలకు తీవ్రంగా గాయమైంది. గాయపడ్డ ఆమెను నరసరావుపేట ఆసుపత్రికి చేర్చగా అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. నాదెండ్ల ఎస్సై పుల్లారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గురజాల అదనపు సివిల్ జడ్జ్ సీనియర్ డివిజన్ వారి కోర్టులో

ఐ.పి. నెంబర్ : 34 / 2024

బిట్వీన్ :

చల్లా శివారెడ్డి, తండ్రి. కోటిరెడ్డి, కొత్త అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా. ...పిటీషనరు

మరియు

1)వెన్నా పేరి రెడ్డి, తండ్రి. వీరారెడ్డి, 2)లోకసాని శంకర్ రెడ్డి, తండ్రి. గురువారెడ్డి,3)లోకసాని శ్రీనివాసరెడ్డి, తండ్రి. లింగారెడ్డి, 4)పాలువాయి లింగారెడ్డి, తండ్రి. సత్యనారాయణ రెడ్డి, 5) పాలువాయి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి. రామిరెడ్డి, 6)వడిశాల లక్ష్మీ, భర్త.కోటిరెడ్డి, అందరి నివాసం.అంబాపురం గ్రామం, గురజాల మం., పల్నాడు జిల్లా,7)మెట్టు కోటిరెడ్డి తండ్రి నాగిరెడ్డి, 8) కాలం హనమాయమ్మ, భర్త.వెంకటేశ్వర రెడ్డి, 9)ఆసం నర్సిరెడ్డి, తండ్రి. పిటీషనరుకు తెలియదు,10)జక్కిరెడ్డి హనిమిరెడ్డి, తండ్రి. కోటిరెడ్డి, 11)కొండా హనుమంత్ రెడ్డి, తండ్రి.పిటీషనరుకు తెలియదు,12)నామాల రాజారెడ్డి, తండ్రి. వెంకటరెడ్డి, 13) సోమసాని చెన్నారెడ్డి, తండ్రి. పుల్లారెడ్డి, ఆర్-7 నుండి ఆర్-13 వరకు నివాసం.కొత్త అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా, 14)రాజవరపు రమేష్ ,తండ్రి. పిటీషనరుకు తెలియదు, నివాసం.సి/ఆఫ్.రైతు మిత్రా సీడ్స్, గురజాల, పల్నాడు జిల్లా., 15) చింతా శ్రీనివాసరావు, తండ్రి.నరసింహారావు, నివాసం. గురజాల, పల్నాడు జిల్లా.,16)తిరుమల ట్రేడింగ్ కంపెనీ తరపున యజమాని చింతా నరసింహారావు, గురజాల, పల్నాడు జిల్లా., 17)రైతు మిత్ర సీడ్స్ తరపున యజమాని రాజవరపు రమేష్, గురజాల, పల్నాడు జిల్లా.,18)విల్ వుడ్ కెమికల్స్ తరపున యజమాని కర్రి సీతారామ్, భవానిపురం, విజయవాడ,19) జక్కిరెడ్డి నరసింహా రెడ్డి, తండ్రి.వెంకటేశ్వర రెడ్డి, కొత్త అంబాపురం, గురజాల మం.పల్నాడు జిల్లా,20) వరసిద్ధి వినాయక ఫెర్టిలైజర్స్ తరపున యజమాని, దాచేపల్లి, పల్నాడు జిల్లా, 21)కొండా హనుమంత రెడ్డి,తండ్రి.పిటీషనరుకు తెలియదు, కొత్త అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా., 22)చల్లా హనిమి రెడ్డి, తండ్రి.పిటీషనరుకు తెలియదు, 23) అనమాల సైదా రెడ్డి, తండ్రి.రాఘవ రెడ్డి, 24)దేవరకొండ సుబ్బాయమ్మ, భర్త.వేమా రెడ్డి,ఆర్-22 నుండి ఆర్-24 నివాసం. అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా., 25) ఆరికట్ల సుబ్బారెడ్డి, తండ్రి.వెంకటేశ్వర రెడ్డి, కొత్త అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా, 26)జక్కిరెడ్డి విఘ్నేశ్వర రెడ్డి, తండ్రి. సైదా రెడ్డి, కొత్త అంబాపురం, గురజాల మం., పల్నాడు జిల్లా, 27)ది అఫీసియల్ రిసీవర్, జిల్లా కోర్టులు ప్రాంగణం, గుంటూరు. ....రెస్పాండెంట్లు

పై నెంబరు లోని పిటీషనరు తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేయగా సదరు పిటీషనులో ఎవరికైనా అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల తెలుపుకొనవలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది.01-10-2024**కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారాగాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్ష మున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా తేది. 01-10-2024

జక్కా చెన్నకేశవ రావు,పిటీషనరు తరపు అడ్వకేట్, గురజాల, పల్నాడు జిల్లా,సెల్.98851 34858

Notice

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE :: TENALI

I.P.No.52/2021

Between:

Pasumathy Samuel Diamand Babu ...Petitioner

And

Kurra Sudarsan & 43 Others ...Respondents

To,

R-12: Vanka Srinivas Guptha,S/o. V.Ramesh Babu,R/o. D.No.12-58-1A, Naz centre, Guntur(Town & Dt.)

R-14: Vemuri Ravi Babu,S/o. Ramesh Babu, R/o.D.No.42-21-13, C.M.Colony, Tenali, Guntur Dist.-522202.

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో12వ & 14వ రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీకు ముట్టనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయమని ది.18-09-2024కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును.లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:18-09-2024

S.**రామకృష్ణ, పిటీషనరు తరపు అడ్వకేట్, తెనాలి, గుంటూరు జిల్లా, సెల్:98666 21508**

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నరసరావుపేట.

I.P No 22/2021

బిట్వీన్:-

బాలనాగు వీర శేషగిరిరావు. .... పిటిషనర్

మరియు

దివ్వెల వెంకటరత్నం మరియు ఇతరులు ....రెస్పాండెంట్లు

R 33) కపిలవాయి అరుణ w/o రమేష్ బాబు (లేట్).

R 34) కపిలవాయి విజయ్ కుమార్ S/o రమేష్ బాబు (లేట్)

R 35) కపిలవాయి సరిత D/o రమేష్ బాబు (లేట్)

R33,34,35 :- గాంధీ బొమ్మ దగ్గర నరసరావుపేట పట్టణం మరియు మండలం పల్నాడు జిల్లా.

R 37) తవ్వా జ్యోతి w/o శ్రీనివాసరావు, రత్నా బేకరీ, బోసు రోడ్డు, చిలకలూరిపేట పట్టణం మరియు మండలం పల్నాడు జిల్లా.

పై నెం. ఐపి 22/2021 నందు బాలనాగు వీర శేషగిరిరావు అను నేను ఐపి దాఖలు చేసుకుని ఉన్నాను. సదరు ఐపి నందు శ్రీయుత కోర్టు వారు R33,34,35,37 అను రెస్పాండెంట్లకు ఎన్నిసార్లు శ్రీ పై కోర్టు వారి ద్వారా సమన్లు పంపినను తీసుకొని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా, సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా సదరు ఐ.పి.22/2021 4-10-2024 కు వాయిదా అయిఉన్నది.సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ మీ న్యాయవాది ద్వారా కానీ శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరములు తెలుకోగలరు. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా 4-10-2024.

ఇట్లు.

పి.చక్రపాణి, బీకాం ఎల్.ఎల్.బి అడ్వకేట్

కె.బి.ఆర్ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 64, నరసరావుపేట, పల్నాడు జిల్లా. సెల్ నెం : 98856 44203

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు : సత్తెనపల్లి.

O.S. No. 568/2022

బిట్వీన్ :

దగ్గుబాటి వెంకాయమ్మ @ వెంకమ్మ .... వాది

అండ్

సోమేపల్లి నరసింహారావు ... ప్రతివాది

టు :

సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్లపల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 12-9-2024న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయ వలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 12-9-2024

సత్తెనపల్లి.

శ్రీ పి.వి.నరసింహ శాస్త్రి, వాది తరపు న్యాయవాది, సత్తెనపల్లి.

మహారాజ శ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు బాపట్ల

I.A. 175/23,176/23,177/23

O.S. No. 78/2014

బిట్వీన్:

చెన్నుపాటి శేషయ్య .... పిటిషనర్ /వాది

చెన్నుపాటి శివరామ కృష్ణయ్య (డైడ్) & 6 ఇంకొంత మంది ..... రెస్పాండెంట్ /ప్రతివాదులు

టు

R5) గడ్డిపాటి అనిల్ చౌదరి S/o (లేటు) ప్రసాదు, హిందూ, వయస్సు 47 సం:లు, సిద్ధాంతి R/o, 26వ వార్డు, శారదా కాలని, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా.

R6) గడ్డిపాటి శరత్‌బాబు, (లేటు) ప్రసాదు, హిందూ, వయస్సు 45 సం.లు, వ్యవసాయం, R/o. 26 వార్డు, శారద కాలనీ, గుంటూరు సిటీ,గుంటూరు జిల్లా.

పై నెంబరు గల దావా ను వాది దావా దాఖలా ఆస్తుల పంపకం గురించి మీ అమ్మగారు మరి కొంత మంది ప్రతి వాదుల పై దావా దాఖలు చేయగా సదరు దావా పెండింగ్ లో ఉండగా మీ అమ్మగారు చనిపోయి నారు. మీ అమ్మగారికి వారసులుగా మిమ్మల్ని దావా లో పార్టీలుగా చేర్చుటకు వాది పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషన్ లో కోర్టు వారు ఎన్ని సార్లు సమన్లు పంపించినను మీరు కావాలని సదరు సమన్లను తీసు కొనక కాలయాపన చేయుచుండగా కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేసి ఉన్నారు.కనుక ది.13-09-2024 నాడు ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని కోర్టులో మీ అభ్యంతరాలను తెలియ జేయగలరు. లేని యెడల మీకు వ్యతిరేకంగా తీర్మానిం చెందరు.

వాయిదా తేదీ :13-09-2024

ఇట్లు

నక్కల వర్ధన్ రావు న్యాయవాది, పొన్నూరు.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

I.P. 58/2023

బిట్వీన్:

Narala Sambasiva Rao .... పిటీషనర్

ఎదిరి

Chadalawada Rama Krishna and others .... రెస్పాండెంట్స్

To,

R6 : Kowthavarapu Srihari S/o Not known, Kirana Shop, R/o Venkataswamy Nilayam, Thota Sriramulu Building, Tenali.

R8 : Devineni Narasaiah S/o Rambabu, R/o Sivaluri Supply Office, Dr. Ravi Ravindranadh Municipal Complex, Near 3 town Police Station, Tenali

పై నెంబరులో పిటీషనర్ మీపై సదరు కోర్టులో ఇన్‌సాల్వెంట్ పిటీషన్ దాఖలు చేసియున్నందున మీ హాజరు నిమిత్తం ది. 30-09-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 30-09-2024

ఎం.రవికుమార్, పిటీషనర్ తరపు అడ్వకేటు, తెనాలి. సెల్ నెం : 98490 81688

మహారాజశ్రీ తెనాలి 1వ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

O.S. 660/2022

బిట్వీన్:

Movva Naga Venkata Shiridi Sai .... వాది

అండ్

Kodali Suresh Babu .... ప్రతివాది

To,

Kodali Suresh Babu, S/o K.Sambasiva Rao, D.no. 1-66, Gudivada Village, Tenali Mandal, Guntur District.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టువారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 23-09-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 23-09-2024

షేక్ కరీమూన్ వాది తరపు అడ్వకేటు, తెనాలి.

సెల్ నెం : 83096 05917

రూపం మారినా నల్లదారికే బియ్యం

- యథేచ్ఛగా కొనసాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా
- బియ్యానికి బదులు కార్డుదారులకు కిలోకు రూ.10 చొప్పున డబ్బులు
- రైస్ మిల్లుకు తరలించి కిలో రూ.25కు ఇతర రాష్ట్రాలకు రవాణా

పిడుగురాళ్ల మండలంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ ఇటీవల పట్టుబడిన వాహనం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పేదలకు అందించే రేషన్ బియ్యం సరఫరా ఎన్ని రూపాలు మార్చుకున్నా నల్ల బజారుకు పట్టడం మాత్రం నియంత్రణ కావడం లేదు. మూడు పువ్వులు ఆరు కాలయలుగా అక్రమార్కుల వ్యవహారం సాగుతోంది. రాష్ట్రంలో ఒకవైపు వరదల బీభత్సవం సృష్టిస్తున్నా రేషన్ అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

రేషన్ బియ్యంపై లబ్ధిదారుల్లో ఉన్న అపోహలను ఆసరా చేసుకుని బియ్యాన్ని వారికివ్వకుండా బదులుగా కిలోకు రూ.10 చొప్పున చెల్లించి ఆ బియ్యాన్ని డీలర్లే తీసుకుంటున్నారు. వీరి వద్ద స్థానికంగా ఉన్న కొందరు దళారులు కిలో రూ.14కు కొంటున్నారు. వారు మరొకరికి కిలో రూ.18 చొప్పున అమ్ముకుంటున్నారు. ఇలా గురజాల నియోజకవర్గంలోని పిడుగరాళ్ళ, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాల నుండి రేషన్ బియ్యాన్ని సేకరించి పిడుగరాళ్ల మండలంలోని జానపాడు శివారులో ఉన్న ఓ రైసు మిల్లుకు తరలిస్తున్నారు. అక్కడి నుండి ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్లాస్టిక్ గోతాల్లో వేసి తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు కిలో రూ.25 వరకూ ధరకు రవాణా చేస్తున్నారు. ఇదతాం అధికారులకు తెలిసే జరుగుతోందని, వారికీ ఇందులో వాటాలు అందుతున్నాయని అరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి 10 వేల టన్నుల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలుతున్నట్లు సమాచారం. మండలానికి కనీసం 3 వేల టన్నులు లక్ష్యంగా అక్రమార్కులు బియ్యం సేకరించి అక్రమంగా తరలిస్తున్నారు. రేషన్ బియ్యంపై ప్రతినెల లక్షలాది రూపాయిల వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం పట్టీపటనట్లు వ్యవహరిస్తూన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కొంతమంది డీలర్లు రేషన్ బియ్యం ఇవ్వకుండా వాటికి ప్రతిగా డబ్బులిస్తామంటున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు. గతంలో వైసిపికి చెందిన వారు రేషన్ షాపులు నిర్వహించగా ఇప్పుడు టిడిపికి చెందిన వారు నిర్వహిస్తున్నారు.నియోజకవర్గంలో 130 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ప్రతినెలా 1200 టన్నుల (12 లక్షల కిలోలు) నుంచి 1350 (13.50 లక్షల కిలోలు) టన్నుల బియ్యం కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇందులో 65-70 శాతం బియ్యం ప్రక్కదారి పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. రేషన్ బియ్యం తీసుకున్నా అవి పది రోజులకు మించి సరిపోవని, మిగతా రోజుల్లో మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి కొనాల్సి వస్తోందని పేదలు వాపోతున్నారు. పైగా బియ్యం మినహా మిగతా సరుకులు ఇవ్వడం లేదని, కందిపప్పు కిలో రూ.220 వరకూ అమ్ముతున్నారని, గతంలో రేషన్ ద్వారా అయితే రూ.65-70కే ఇచ్చేవారని అంటున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడ్డంతోపాటు కందిపప్పు, నూనె తదితర సరుకులనూ ఇవ్వాలని కోరుతున్నారు.

సిపిఎం నాయకులు బుంగా నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిపిఎం పట్టణ రెండో శాఖ కార్యదర్శి బుంగా నాగేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు భౌతికకాయాన్ని మండలంలోని జానపాడులోని ఆయన నివాసం వద్ద సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఇతర నాయకులు బుధవారం సందర్శించారు. ఎర్ర జెండాను కప్పి, పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభకు సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ బుంగ నాగేశ్వరరావు సున్నం మిల్లులో సుదీర్ఘ కాలం పని చేశారని, ఆయన పని మానుకునే సందర్భంలో యజమానులు తనకు రావాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ ఇవ్వడానికి నిరాకరిస్తే ఆయన సిఐటియు జెండాని ఆశ్రయించి అలుపెరగని పోరాటం చేసి పరిహారం సాధించారని చెప్పారు. సున్న ఒమిల్లు కార్మికుల కూలి రేట్ల ఒప్పందాల సమయంలో కార్మికులను ఐక్యం చేయడంలో, రైతు సమస్యల పరిష్కారం కోసం చివరివరకు పోరాడారని కొనియాడారు. ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ పిడుగురాళ్లలో ఇళ్లు లేని పేదల కోసం సుందరయ్య కాలనీ నిర్మాణంలో నాగేశ్వరరావు కీలకంగా వ్యవహరించారని చెప్పారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో నాయకులు షేక్ బాబు, జి.కొండమ్మ, షేక్ హుస్సేన, బి.వెంకటేశ్వర్లు, డి.భూలక్ష్మి తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఎర్ర జెండాలు పట్టుకుని అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న గుంటూరు, విజయ్‌కుమార్, ఏపూరి గోపాలరావు తదితరులు, ఇన్‌సెట్‌లో బుంగా నాగేశ్వరరావు (ఫైల్)

ప్రజా సమస్యలపై సిపిఎం శాఖా మహాసభల్లో తీర్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

దేశంలో కార్పొరేట్లు, మతోన్మాదులు తోడై ప్రజల సంపదను దోచేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. స్థానిక ముజిఫర్ అహ్మద్ చౌక్ వద్ద సిపిఎం 16వ వార్డు శాఖ మహాసభ బుధవారం జరిగింది. తొలుత సిపిఎం జెండాను యర్రంశెట్టి వెంకటరావు ఆవిష్కరించారు. షేక్ సైదావలి అధ్యక్షతన జరిగిన సభలో చలమయ్య మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మాట్లాడ్డం లేదని, జైళ్లకు పంపుతుందేమోనని భయపడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై సిపిఎం నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న క్లైములన్నిటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు. పంట నష్టపరిహారం కౌలురైతులకే ఇప్పించాలన్నారు. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖ కార్యదర్శి ఎం.హరిపోతురాజు ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. నాయకులు జె.రాజ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరరావు, ఎం.రమాకుమారి, బి.భాస్కరరావు, జి.వేమయ్య, షేక్ జానీబాష పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సిపిఎం ఫణిదం శాఖ మహాసభ గ్రామంలో బుధవారం జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, మండల కార్యదర్శి పి.మహేష్ హాజరై మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను వెంటనే ప్రకటించి కౌల్దార్లందరికీ వర్తింపజేయాలని, గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, ఉపాధి హామీ పని దినాలు పెంచి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలిని, స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖ కార్యదర్శిగా వంగర తులసీరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి - అమరావతి

వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులన్ని, ప్రజల్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు మల్లేశ్వరి కోరారు. స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్‌లో సిపిఎం అమరావతి రూరల్ శాఖ ప్రథమ మహాసభ గుంటుపల్లి కోటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. మల్లీశ్వరి మాట్లాడుతూ ఏ పంటలకు ఎంత నష్టపరిహారం ఇస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలన్నారు. పరిహారం నమోదులో కౌలురైతుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేయాలని, మళ్లీ సాగు కోసం విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కోరారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు, ఇతర పేదలు చెల్లించాల్సిన రుణాలను వాయిదా వేయాలన్నారు. అనంతరం నూతన కార్యదర్శిగా సయ్యద్ మొహిద్దీన్‌వలి ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, అమరావతి టౌన్ శాఖా కార్యదర్శి బి.సూరి బాబు, ఎన్.వెంకటేశ్వరరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుల్లారావుకు మాతృవియోగం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు తల్లి చిననారాయణమ్మ (85) బుధవారం ఉదయం మరణించారు. ఈమె భర్త సుబ్బారావు కొన్నేళ్ల కిందటే చనిపోయారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిననారాయణమ్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భౌతికకాయాన్ని బుధవారం రాత్రికి చిలకలూరిపేట తీసుకొస్తారని, గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నంబర్ ప్లేట్లంటూ డబ్బులు వసూలు చేస్తే చెప్పండి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

విద్యుత్ సర్వీసు నంబర్‌ప్లేట్ల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె.హరిబాబు బుధవారం ఒక ప్రకనలో తెలిపారు. మాచర్ల డివిజన్ పరిధిలో కొంతమంది అనుమానితులు విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి విద్యుత్ సర్వీసు నంబరు నేమ్ ప్లేట్స్‌ను బిగించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారికి విద్యుత్ శాఖ అనుమతులేమీ ఇవ్వలేదని తెలిపారు.

నర్సు కుమారిని సత్కరిస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కాలేజీ అధ్యాపకురాలు నర్సుకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం పరిధిలో గల ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల అధ్యాపకులు కె.నర్సుకుమారికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్‌డిని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ-కరస్పాండెంట్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కె.నర్సుకుమారికి కెమిస్ట్రీ విభాగం నుండి పిహెచ్‌డి అందజేసినట్లు చెప్పారు. నిబద్ధత, స్వయం కృషి, పట్టుదలతో నర్సుకుమారి రసాయన శాస్త్రం పట్ల ఉన్న మక్కువతో అనేక ఔషధాలపైన హెచ్‌పిఎల్‌సి మెథడ్ డెవలప్మెంట్, వాలిడేషన్ అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, కళాశాల డీన్ ఎం.లక్ష్మీ సురేఖ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల పట్టణంలో ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలు, ప్రధానంగా నెట్టుడు బండ్లపై వ్యాపారం చేసేవారి కారణంగా తీవ్రంగా ట్రాఫిక్ సమస్య వస్తోందని పట్టణ సిఐ ప్రభాకరరావు అన్నారు. అంబేద్కర్ సెంటర్లో ట్రాఫిక్‌ను బుధవారం పరిశీలించిన ఆయన నెట్టుడు బండ్లు, ఆటోరిక్షాలను ఇష్టనుసారం నిలపడం వల్ల ఈ ప్రాంతంలో కనీసం నడవటానికి కూడా వీలు లేకుండా పోతుందని అన్నారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి

వరద ముంపు పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకుల బృందం

ప్రజాశక్తి -పెదకాకాని

జిల్లా వ్యాపితంగా గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, వాగులు, పంట కాల్వలు తెగిపోయాయి. పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి మండలాల్లో వరి పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నేటికి పొలాల్లో నీరు నిలచి చెరువులను తలపిస్తున్నాయని ప్రభుత్వం వెంటనే పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేసి ఎకరాకు కనీసం రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం పెదకాకాని మండలంలోని హాఫ్‌పేట గ్రామాలలో నీటమునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.35వేలు కౌలు చెల్లించామని, మరో రై30వేలు పెట్టుబడి పెట్టామని పంట మొత్తం నీళ్లపాలైందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు నాయకులకు తెలిపారు. గోళ్లమూడి వద్ద గుంటూరు ఛానల్, గారకుంట డ్రైనేజీ పొంగిపొలాల్లో ప్రవహించాయని చెరువు కట్టలు తెగి పొలాలపై పడ్డాయని రైతులు సర్వం కోల్పోయారని తమ పరిశీలనలో తెలిసిందని నాయకులు తెలిపారు. పంట కాల్వలు కూడా తెగిపోయా యాని, కాల్వలై నీటి పారుదల శాఖ అజ మాయిషీ లేదని, నేటికీ కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క, పూడికతీత పనులు జరగలేదని చెప్పారు. వరదలు వస్తున్నట్లు ముందస్తు హెచ్చరికలు ప్రభుత్వ యంత్రాంగం చేయలేదని చెప్పారు. కేంద్ర బృందం నష్టాన్ని అంచనా వేయడానికి పెదకాకాని మండలంలో పర్యటిస్తున్నట్లు అధికారులు తెలిపారని, నష్టం జరిగిన గ్రామాలను సందర్శించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడుతు రైతులు పొలాల్లో నిల్వ చేసుకున్న ఎరువుల బస్తాలు కూడా కొట్టుకుపోయాయని, దిక్కుతోచని స్థితిలో వారున్నారని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా రెండం పంటకు విత్తనాలు, ఎరువులు బాధిత రైతులకు అందజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు పెట్టుబడి సహాయం వెంటనే అందించాలని కోరారు. పంటనష్టపోయిన ప్రాంతాల్లో మరలా పంట వేయాలనంటే నారు కట్ట రూ.20కు కొనాల్సి వస్తుందని, ఎకరాకు నారు కొనుగోలుకు రూ.10వేలు వెచ్చించాల్సి వస్తుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజారమేష్, స్థానిక రైతులు వసంతరావు, రాంబాబు, గోపి, వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పంటనష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న పాశం రామారావు , నన్నపనేని శివాజి

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద 2018లో జరిగిన ధర్నా సందర్భంగా యూనియన్ నాయకులపై నగరంపాలెం పోలీసులు మోపిన కేసులో రుజువు లేకపోవటంతో స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు (మొబైల్ కోర్టు జడ్జ్) కేసును కొట్టివేస్తూ బుధవారం తీర్పునిచ్చారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వారిలో యానిమేటర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షులు (ప్రస్తుత సిఐటియు ప్రధాన కార్యదర్శి) వె.నేతాజీ, యానిమేటర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుమారి, మంజుల, తిరుపతిరావు, ప్రసాదరావు, సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు, కాపు శ్రీనివాసరావు, డి.లెనిన్, ఎస్.కె షకీలపై మోపిన కేసును కోర్టు కొట్టివేసింది.

పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు

ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లా యిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. స్థానిక పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహిం చిన జిల్లా నాల్గవ మహాసభలో గౌర వాధ్యక్షులుగా వై.నేతాజీ అధ్యక్షులుగా చందోలు రామారావు, ఉపాధ్యక్షులుగా సుభాష్ చంద్రబోస్, రాఘవమ్మ, ప్రధాన కార్యదర్శిగా చింతల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఎడ్లూరి మోహన్, ఆర్.కోటేశ్వరరావు.నూతక్కి వీరయ్య, కోశాధికారిగా దీపికతో పాటు మరో 17 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చింతల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో గౌరవాధ్యక్షులు వై.నేతాజీ కార్యకలాపాల నివేదిక ప్రవేవపెట్టారు.కాంటాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ సౌహార్ధ సందేశాలు ఇచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి ప్రసంగించారు.

వినతి పత్రం ఇస్తున్న సాంబిరెడ్డి తదితరులు

వాణిజ్య పంటలకు తీరని నష్టం

ప్రజాశక్తి - కొల్లిపర: భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన వాణిజ్య పంటల రైతులకు ప్రభుత్వము ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కొల్లిపర మండలంలోని వల్లభాపురం గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల బ్యాంకు రుణాలను రద్దుచేసి కొత్త రుణాలను మంజూరు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు కౌలు రైతులకు రూ.20వేలు అందించాలన్నారు. యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడ మే కాక ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదానికి గురి అయిన పసుపు రైతులకు ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా క్వింటాలుకు రూ.7000 పరిహారం వెంటనే అందిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనం తరం వినతి పత్రాన్ని వల్లభాపురం పంచాయతీ కార్యదర్శి ఎం అలకనందకు అందజేశారు. కార్యక్రమంలో వల్లభాపురం ధర్మయ్య అత్తోట వీరయ్య ఎం సుబ్బారెడ్డి కనపల రమేష్ ప్రేమయ్య ఏసోబు పాల్గొన్నారు.

విజయవాడలో డ్రెయిన్ల అక్రమణలు తొలగిస్తున్న జిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ముంపునకు ప్రధాన కారణమైన డ్రైన్ల ఆక్రమణలను యుద్ధ ప్రాదిపదికన తొలగిస్తున్నామని నగర కమిషనర్, 62వ డివిజన్ పర్యవేక్షణా అధికారి పులి శ్రీనివాసులు తెలిపారు. కల్వర్ట్‌లను జెట్టింగ్ యంత్రాల ద్వారా, యంత్రాలు వెళ్లడానికి వీలులేని చిన్న వీధుల్లో గల్ఫర్ యంత్రాలతో మెగా పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. బుధవారం విజయవాడ నగరపాలక కమిషనర్ ధ్యాన్ చంద్‌తో కలిసి 62వ డివిజన్‌లోని ప్రధాన రహదారుల వెంబడి డ్రైన్ల ఆక్రమణలను 3 జెసిబిలు, చిన్న వీధుల్లో నిలిచిన బురదను 7 గల్ఫర్ యంత్రాల ద్వారా, 2 జెట్టింగ్ యంత్రాలతో కల్వర్ట్‌లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో డ్రైన్ల మీద ర్యాంప్‌లు, ఆక్రమణలు ఏర్పాటు చేయడం వలన వరద నీరు బయటకు వెళ్లటానికి ఆటంకం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రధాన డ్రైన్ల మీద ఆక్రమణలను జెసిబిల ద్వారా తొలగిస్తున్నామన్నారు.

ఐలమ్మ నృత్య రూపకంలో తెనాలి కళాకారిణి

ప్రజాశక్తి - తెనాలి

సామాజిక ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ నృత్య రూపకం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలందుకుంది. ప్రదర్శనలో తెనాలికి చెందిన నృత్యకారిణి, దూరదర్శన్ బి గ్రేడ్ ఆర్టిస్ట్ ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య పాల్గొనడం విశేషం. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి తెలంగాణ నాటక అకాడమి చైర్మన్ చాకలి ఐలమ్మ పాత్రధారిణి అలేఖ్య పుంజల సత్య దర్శకత్వంలో తెలంగాణ సామాజిక ఉద్యమకర్త 'చాకలి ఐలమ్మ' ఉద్యమ ఇతివృత్తాన్ని నృత్యరూపకంగా మలిచి అత్యంత అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నటీనటులపై ప్రశంసల జల్లు కురిపించినట్లు తేజస్వి ప్రఖ్య బుధవారం మీడియాతో వెల్లడించారు.

కిలో ఉల్లిపాయలు @ రూ.70

ఆనియన్ అడగరాదని హోటళ్లలో బోర్డులు

ప్రజాశక్తి - మంగళగిరి

కూరల్లో నిత్యవసరమైన ఉల్లిపాయల ధర రోజు రోజుకి పెరిగిపోతుంది. సాధారణంగా ఉల్లిపాయల్ని కోస్తుంటే కన్నీళ్లు వస్తాయి.కొనాలంటే కోయకుండానే కన్నీళ్లు వస్తున్నాయి. మంగళగిరిలో బహిరంగ మార్కెట్లో రూ.70 కేజీ ధర పలుకు తుంది. రైతు బజార్లో రూ.60 ఉంది. దీనివల్ల మంగళగిరిలోని అన్ని హోటళ్లలో ఉల్లిపాయలు అడగరాదని బోర్డులు పెడు తున్నారు. మార్కెట్ అంతా మహారాష్ట్ర పై ఆధారపడి ఉంటుంది. ఇటీవల మహారాష్ట్రలో కురిసిన వర్షాల వలన పంటలు బాగా దెబ్బతిన్నాయి. అందువల్ల ఉల్లిపాయ కొరత ఏర్పడిందని వ్యాపా రస్తులు చెబుతున్నారు. అన్ని కూరల్లో వాడే ఉల్లిపాయలను ప్రభుత్వం సబ్సిడీపై ఇప్పించాలని ప్రజల కోరుతున్నారు.

ఆయిల్ బాల్స్ చల్లుతున్న కమిషనర్

దోమల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన దోమల నియంత్రణ చర్యలను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పర్యవేక్షించారు. పట్టణంలోని నాల్గవ శానిటరి డివిజన్ 12వ వార్డు డొంక రోడ్డులో ఖాళీ నివేశన స్థలంలో ఉన్న నీటిపై ఆయిల్ బాల్స్ చల్లించే కిర్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. నిలువ నీటిపై దోమల సంచారం ప్రమాదకరమని దానిని అరికట్టాలన్నారు. ఇంటి ఆవరణలోనూ చుట్టుపక్కల ప్రాంతా లలో కూడా ప్రజలు నీటి నిలువలు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధి కారిణి డాక్టర్ కె. హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్స్పెక్టర్ డో శ్రీనివాస రావు, శానిటరీ సెక్రటరీలు కె సంధ్య, శాంతి, హవీల, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

పంపిణీలో రోటరీ బృందం సభ్యులు

'ఆపద్భంధు' పేరిట ముంపు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు రోటరీ డిస్టిక్ 3150 ద్వారా చేపట్టిన నిత్యావసరాల కిట్లు పంపిణీ బుధవారం రేపల్లె మండలం పల్లెపాలెం, బొబ్బర్లంక గ్రామాలలో నిర్వహించారు. దాదాపు రూ.1100 విలువైన 400 నిత్యవసర సరుకుల కిట్లు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ ఫాస్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె విష్ణ పర్యవేక్షించగా రేపల్లె రూరల్, పొన్నూరు, పర్చూరు, పిడుగురాళ్ల, చీరాల క్లబ్, అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, డిస్ట్రిక్ట్ గవర్నర్, శివరంజని, స్వప్న, ఎంఎం సంక్షేణ, తెనాలి క్లబ్ నుంచి కన్నెగంటి మురళీకష్ణ, ఈదర వెంకట పూర్ణ చంద్, పావులూరి రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : భవన నిర్మాణకార్మికులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాదరావు, సిలార్ మసూద్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో దశాబ్ధ కాలంగా పోరాటం చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికలకు ముందు టిడిపి నేతలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవుపలికారు. భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలిపేస్తూ గత ప్రభుత్వం తెచ్చిన మెమో నెంబర్ 1214ను రద్దు చేయాలని డిమాండు చేశారు. దీనివల్ల పల్నాడు జిల్లాలో సుమారు రూ.6 కోట్ల వరకు సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన లబ్ధి నిలిచిపోయిందని తెలిపారు. ప్రమాదాల్లో మృతి చెందినా, సహజ మరణం పొందినా కార్మికుల కుటుంబాలకు, వైకల్యానికి గురైన కార్మికులకు, కార్మికుల పిల్లల వివాహాల సందర్భంలో, ప్రసూతి సహాయాలు, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్పులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వీటన్నింటికీ ప్రభుత్వాలపై రూపాయి కూడా భారం పడదని, భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో రూ.వందల కోట్ల నిధులున్నాయని అన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చినా ఆశించిన స్థాయిలో ధరలు తగ్గలేదని, వినియోగదారుడికి సరసమైన ధరకు అందుబాటులో ఉండేలా సమగ్ర విసుక విధానాన్ని తేవాలని కోరారు. దీనిద్వారా నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి పెరుగుతుందన్నారు. అన్ని ఇసుక రీచ్‌లను తెరచి ఇసుక రేవుల్లో పనిచేసే కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వాలు చేపట్టే నిర్మాణాల్లో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సురేష్, బి.బాలకోటయ్య, షేక్ జానీ, మస్తాన్, మస్తాన్‌వలి, కరీముల్లా, జానీబాష, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కొండయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

దేశ భవిష్యత్తు తరగతి నాలుగ్గోడల మధ్య నిర్మీతమవుతుందని డాక్టర్ కొఠారి కమిషన్ చెప్పిన సూక్తి నిజమవుతుందని మాచర్ల మండల విద్యాశాఖ అధికారులు కె.కాంతారావు, అల్లి సురేష్‌లు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిహెచ్.కొండయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాదే కిరీటిరెడ్డి అధ్యక్షతన స్థానిక వీరభద్రపురం నెహ్రూనగర్ జెడ్‌పి హైస్కూల్లో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మరో ముఖ్య అతిథి జడ్పీ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ షకీనా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి ఆయన దేశానికి చేసిన సేవలు, ఉపాధ్యాయుడిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది షేక్ రెహనా, నాగమణి, ఆదిలక్ష్మి, నిర్మల మేరీ, కేశవరెడ్డి ఏడుకొండలు, నాగరాజు, సుజాతమ్మ, పద్మావతి, ఆసయ్య, కొర్లయలు మాస్టర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

స్కూల్ డేటాను ఆన్‌లైన్ చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సెప్టెంబర్ 27లోపు పాఠశాలల పూర్తి సమాచారాన్ని యూడైస్ ప్లస్ పోర్టల్లో అప్ లోడ్ చేయాలని సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసరావు సూచించారు. సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎడిట్ ఆప్షన్ లేదని తప్పుడు సమాచారం నింపితే అందుకు పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, ఎంఇఒ 2 రాఘవేంద్రరావు వివరించారు. సిఆర్పీలు టి.నరేంద్ర, శ్రీకాంత్, ప్రసాద్, ఇందిరా, మల్లేశ్వరి, ప్రశాంతి లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి పెదకూరపాడు

గ్రామాభివృద్ధికి, పేదల ఆర్థిక స్వావలాంబనకు టిడిపి కృషి చేస్తోందని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని లింగంగుంట్ల, పెద్దకూరపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలు చోట్ల వినాయక ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో ప్రజల సమస్య లను ఆయన అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధ్యక్షులు రమేష్, జి.బాబురావు, ఎస్.ముంతాజ్, పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామంలోని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల యొక్క లార్వా వద్ధి చెందకుండా దోమలను అరికట్టడం కోసం జంబో ఇంజనులతో పాగింగ్ చేస్తున్నట్లు పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు అన్నారు. బుధవారం పంచాయితీ కార్యదర్శి సుధారాణితో కలిసి సర్పంచ్ రాజు ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ చేస్తామన్నారు. అత్యవసరమైతే పంచాయతీలో గాని లేదా ఫోన్ ద్వారా గాని సంప్రదించాలన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులతోనే దిగుబడి సాధ్యం

ప్రజాశక్తి- మాచర్ల

స్థానిక ఎంపిడీవో కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి వ్యవసాయ సాంకేతిక సామర్థ్యల పెంపొందించే శిక్షణా కార్యక్రమం జరిగింది. ఏడీఏ జగదీశ్వరరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త సైదా నాయక్ మాట్లాడుతూ మేలైన వ్యవసాయ సాంకేతక పద్ధతులను రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది వారిని చైతన్యం చేయాలని కోరారు. ప్రత్తి పంటలో పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ, క్రాప్ లైఫ్ సిస్టమ్ తదితర అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, అధికారులు పి. ప్రవీణ్‌కుమార్, లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, అమీర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, ఎం. సంధ్యారాణి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు...

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైనా ముప్పాళ్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రావిపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన బుధవారం చేపట్టారు. గ్రామంలోని పలు కాలనీలలో పంచాయతీ డ్రెయినేజీ మురుగును తొలగించి పూడిక తీశారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని జేసిబితో తొలగించారు. ఈ పారిశుధ్య పనులను ఈవోపిఆర్‌డి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈవోపిఆర్‌డి రూపావతి మాట్లాడుతూ వర్షాకాలంలో ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

తొలిదశలోనే కేసులు రాజీ కుదర్చండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఈనెల14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్ అధికారులతో న్యాయమూర్తి బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు హాల్లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)సత్తెనపల్లి సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ, చైర్మన్ సిహెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల పరిధిలో ఉన్న స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో జాతీయ లోక్ అదాలత్‌లో ఆయా స్టేషన్ పరిధిలో ఉన్న రాజీ పడదగిన కేసులన్నీ పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గం అని అన్నారు. ప్రజల్లో కక్ష కార్పణ్యాలు పెరగకుండా కేసులు తొలి దశలోనే పరిష్కారం అయ్యేలా చూడాలి అని అన్నారు. ఈ సమావేశంలో ,సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి

(జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్ మరియు సత్తెనపల్లి 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి. ప్రియదర్శిని లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టిడిపి నేత

ప్రజాశక్తి - వినుకొండ

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా గత 5 సంవత్సరాలుగా పనిచేసిన కాసరగడ్డ నాగార్జున అధికార టిడిపిని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నాయకత్వంలో బుధవారం అధికారికంగా ఆపార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ భావజాలానికి ఆకర్షితులై, రాహుల్ గాంధీ నాయకత్వం పట్ల గౌరవంతో పార్టీలో చేరానని అన్నారు. ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం కాగలదని విశ్వసిస్తున్నానని అన్నారు. నాగార్జున సేవలను రాష్ట్ర కమిటీలో వినియోగించుకొనే ఆలోచనలో రాష్ట్ర నాయకత్వం ఉందని నాయకులు పేర్కొంటున్నారు. వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలం గుండె పల్లి గ్రామానికి చెందిన కాసరగడ్డ నాగార్జున టిడిపి బలోపేతానికి సేవలందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీ.అలెగ్జాండర్ సుధాకర్, గొంది.సురేశ్ సోమశేఖర్.వడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రాజెక్టు పరిధిలోని బాలికల హైస్కూల్లో ఘనంగా పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. జరిపారు. దీనికి సూపర్వైజర్ కే.శ్రీలత అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చున్నారు. ముఖ్యంగా గర్భిణీలకు బాలింతలకు ఎదిగే పిల్లలకు ప్రభుత్వము పౌష్టికాహారాన్ని అందజేస్తుందని, మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల పిల్లలు మహిళలు రక్తహీనత లోపం నివారించవచ్చన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లల ఆరోగ్య పట్ల ప్రత్యేకదృష్టి కనపరచాలని తెలిపారు పుట్టిన పిల్లలలో డబ్బా పాలు కాకుండా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల అనారోగ్యం గురికాకుండా ఉంటారని పేర్కొన్నారు. అందరూ మాంసాకత్తులు చిరుధాన్యాలు ఆకుకూరలు కూరగాయలు పండ్లు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు, సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, అంగన్వాడీ టీచర్లు జి.విజయ, రేవతి, సుధా,గాయత్రి, సోనీ, నాగజ్యోతి, మేరీ, సరస్వతి, కనకమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

ప్రజాశక్తి-తాడేపల్లి

మొన్నటి దాకా తహశీల్దార్ కార్యాలయంలో కాసులు పండించిన ఇసుక గురువారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం కానుంది. ఎపి శాండ్ పోర్టల్‌లో ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రవాణా ఛార్జీల విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఇసుక రవాణా ఛార్జీల కంటే 30 నుంచి 50 శాతం పెంచాలని ప్రభుత్వం భావించినట్లు రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు. రాష్ట్రం మొత్తం ఒకే ధర ఉండేలా రవాణా ఛార్జీలు నిర్ణయించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 4 నుంచి 5 టన్నుల ఇసుక రవాణా చేసే ట్రాక్టర్‌కు పది కిలోమీటర్ల లోపు రూ.547 వసూలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మొన్నటి దాకా కృష్ణానదికి వరదలు రాక ముందు రెవెన్యూ కార్యాలయాల్లో ఇసుక సిరులు కురిపించింది. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఇసుక బుకింగ్ కోసం వాహనదారులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు అదనంగా చెల్లిస్తే గంటల వ్యవధిలోనే సంబంధిత వాహన యజమానులకు అనుమతులు మంజూరయ్యేవి. రెవెన్యూ సిబ్బంది ఈ విధానంతో లక్షలు దండుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాసులు చెల్లించకుండా రోజంతా నిలబడ్డా అనుమతులు రావడంలేదు ఎందుకని వాహన యజ మానులు ఆరా తీయగా ఇబ్బందికరమైన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. దీనికి సంబంధించి కొందరు అధికారులు వద్ద ఇంటి దగ్గరే మాట్లాడుకుని డబ్బులు చెల్లిస్తే ఆ వాహనానికి వెంటనే అనుమతులు వచ్చేవి. నేటి నుంచి తీసుకొస్తున్న ఇసుక ఆన్‌లైన్ బకింగ్‌లోనైనా ఎటువంటి అవినీతి లేకుండా జరుగు తుందా లేదా అనే చర్చ ఇసుక వాహనదారుల్లో నెలకొంది. ప్రభుత్వం వచ్చి మూడు నెలలు దాటినా ఉచిత విధానంపై స్పష్టత లేకపోవడం పట్ల అటు వాహనదారులతో పాటు ఇటు వినియోగదారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న దాతల దాతృత్వం

పసుపు పంటను పరిశీలిస్తున్న పరిటాల సునీత, ఆలపాటి

బాధితులకు హార్వెస్ట్ ఇండియా సాయం

ప్రజాశక్తి - కొల్లిపర : బాధితులకు బాసటగా హార్వెస్ట్ ఇండియా సంస్థ నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా అన్నారు. బుధవారం కొల్లిపర మండలంలోని వరదముంపు గ్రామాలైన బొమ్మవానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక, గ్రామాల్లో ని కుటుంబాలకు వంట పాత్రలు, దోమ తెరలు, దుప్పట్లు తదితర వస్తువులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కత్తెర సురేష్ కుమార్ హార్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వరదల కారణంగా దెబ్బతిన్న గృహాలను, పంటలను పరిశీలించారు.

రాజధాని రైతుల చేయూత

ప్రజాశక్తి - తుళ్లూరు : వరద కారణంగా నిరాశ్రయులైన రాయపూడి, పెదలంక వాసులకు రాజధాని రైతులు,మహిళలు, రైతు కూలీలు అండగా నిలిచారు. దుస్తులు, వంట సామాగ్రి, బియ్యం, పలు వస్తువులను సేకరించారు. వాటిని మంగళవారం రాత్రి పెదలంక చెందిన మెండెం నాగరాజు ద్వారా బాధితులకు అందజేశారు. సేకరణ కార్యక్రమంలో రైతులు కాటా అప్పారావు, కొమ్మినేని రమేష్, పువ్వాడ భరత్, గోవిందమ్మ, అరుంధతి, జెట్టి రమేష్, గడ్డం వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

మూడు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి కొత్తూరు మారుతినగర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మూడు వేల మందికి అన్న దానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కార్యదర్శి దారా దాసు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉద్దంటి గణేష్‌కుమార్, నవీన్, కృష్ణ, శ్రీను, మహేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద బాలగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాధితులకు పులిహోర, దద్దోజనం పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

బుడమేరు ముంపు బాధితులకు బుధవారం మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం బాధితులకు 1000 పులిహోర, దద్దోజనం ప్యాకెట్లను పంపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జెవ నారాయణ,శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు వాకా మంగారావు, దేవస్థానం ప్రధాన అర్చకులు టీ మహేష్ కుమార్, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ కు చెక్కును అందజేసిన ఆశాబాల, కుటుంబ సభ్యులు

టిడిపి మహిళానేత ఆశాబాల రూ.1.8 లక్షల వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

వరద బాధితులను ఆదుకునేందుకు బుధవారం సచివాలయంలోని 4వ బ్లాక్ లో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.1.8 లక్షల చెక్కును రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆశాబాల సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆశాభాల కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

లంక వాసులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉద్దండరాయునిపాలెం లంక వాసులకు టిడిపి నాయకులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లను, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూవరదల వల్ల లంక వాసులు ఎన్నో ఏళ్ళు గా పలు విధాలుగా నష్ట పోతున్నారని, శాశ్వత ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు తీసుకునేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని అన్నారు. వరద సహాయక చర్యల్లో వైసిపికి చెందిన ఒక్క నాయకుడు కూడా పాల్గొన లేదని, జైలులో ఉన్న వైసిపి మాజీ ఎంపిని కలిసేందుకు వచ్చిన మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలు ఆక్షేపణీయంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భోగినేని అప్పారావు,జమ్ముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రెయిన్లను నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో అధికారులను కోరారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో పూర్తిస్థాయిలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణం జరగడం లేదని అన్నారు. అధికంగా వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీళ్లు నిలబడిపోయి వారం రోజులైనా వర్షపు నీరు పోవడం లేదని అన్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని, డ్రైన్లు సరిగా లేకపోవడం వలన మురుగునీరు నిల్వ ఉండి, దోమలు అధికంగా ప్రబలుతున్నాయని అన్నారు. ఈ దోమ కాటు వలన ప్రజలకు డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాలలో వాడిన వ్యర్థపు మురుగు నీరు రోడ్లపై వచ్చి చేరడంతో, రోడ్లు పల్లంగా ఉన్నచోట ద్విచక్ర వాహనాలు జారి, వాహనదారులకు గాయాలవుతున్నాయని, పాఠశాలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు, రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. తక్షణమే సంబంధిత గ్రామ సచివాలయ అధికారులు గ్రామస్తుల కు ఇబ్బందులు కలగకుండా, అసంపూర్తిగా ఉన్న రోడ్లను నిర్మాణం చేపట్టి, మురుగునీరు పోయే విధంగా డ్రైన్లు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కోరారు.

కుంచనపల్లిలో రోడ్లపై ఇంకని మురుగునీరు

వర్సిటీ వద్ద వినాయక విగ్రహానికి పూజలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.గంగాధరరావు వినాయక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కుటుంబానికి క్షేమం జరగాలని, అభివృద్ధి మరింత రెట్టింపు అవ్వాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య వి. వెంకటేశ్వర్లు, ఆచార్య ఎల్ .జయశ్రీ, డాక్టర్ ఎం .వి. రమణ, డాక్టర్ శ్రీ కృష్ణ విద్యార్థి సంఘాల నాయకులు అభిషేక్, బత్తుల హేమంత్ పాల్గొన్నారు.

తెనాలి టూటౌన్ సిఐగా నిస్సార్ బాషా

ప్రజాశక్తి - తెనాలి

పట్టణ టు టౌన్ సిఐ గా ఎస్.కె ఎండి నిస్సార్ భాషా ను నియమిస్తూ రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాటి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సి ఐ గా పనిచేస్తున్న సుధాకర్ ఇటీవల ఓ కేసులో సస్పెన్షన్ కు గురైన సంగతి తెలిసిందే. కాగా నిస్సార్ భాషా విఆర్ నుంచి సిఐగా రానున్నారు.

తాడేపల్లి ఎస్ఐగా శ్రీనివాస్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి నూతన ఎస్ఐగా జె.శ్రీనివాస్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. జిల్లాలోని పలు స్టేషన్లలో విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ తాడేపల్లి సిఐ కల్యాణరాజును కలిసి బొకే అందజేశారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడబోమని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు డెమో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయణి ప్రసూన దేవి అన్నారు. వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి విష జ్వరాలతో పాటు అనేక వ్యాధులు ప్రభలుతున్నాయని, ఈనేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించడంద్వారా అనారోగ్యం దరిచేరకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఇందులోభాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై ప్రోత్సహిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించడం, ఇరుగుపొరుగువారిని చైతన్య పరచుట తదితర అంశాలపై విద్యార్థులకు పాఠశాల చిత్రలేఖ నోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ డెమో నిర్వహించారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్ మా' మాసోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అధిక పోషకాలు కూడిన ఆకుకూరలను ఆహారంతో కలిపి తీసుకున్నట్లైతే గర్భిణీ స్త్రీలు, తల్లులు ఎదుర్కొనే రక్తహీనతను అరికట్టవచ్చని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఉమాదేవి అన్నారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వ హించిన 'పోషణ్ మా' మాసోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రక్తహీనత కల్గిన గర్భిణులు, తల్లులు ఆకుకూరల ఆహారాన్ని తరచూ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మునగాకు అలాగే విటమిన్ 'సి' లభించే ఉసిరి, నిమ్మ, బత్తాయ పండ్లను అధికంగా తీసుకోవాలని సూచిం చారు. గర్భస్థ సమ యంలో పాటించవలసిన జాగ్రత్తలను తెనాలి సిడిపిఓ డాక్టర్ ఎం సునీత తెలియజేసారు. క్రమం తప్పకు ండా తల్లులు పాలు ఇవ్వడం ద్వారా తమ చిన్నారుల్లో రోగనిరోధకశక్తి పెంపొందు తుందని ప్రముఖ స్త్రీల వైద్యులు డాక్టర్ శారద తెలిపారు. కొలకలూరు సూపర్వైజర్ హిమబిందు అధ్యక్షతన ఖాజీ పేటలో పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్సి వైద్యులు డాక్టర్ సుబ్బారావు, నోడల్ అధికారి శ్రీవాణి, కొలకలూరు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో భాష్యం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరచటం అభినందనీయం అని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ క్యాంపస్‌లో స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిబ కనబరిచి, బంగారు పతకం సాధించిన భాష్యం మెడెక్స్ విద్యార్థిని వంకాయలపాటి భావన శౌర్యను రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 23న హైదరాబాద్ యూనివర్సిటీలో రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో సీనియర్, జూనియర్ 50 మీటర్ల విభాగంలో భావనశౌర్య ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిందన్నారు. అలాగే 2022లో 10 మీటర్ల విబాగంలో సబ్‌యూత్ జూనియర్, సీనియర్ విభాగాలలో వెండి పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023లో నిర్వహించిన అండర్ 19 విభాగంలో 10 మీటర్ల రైఫిల్ షూటింగ్ పోటీల్లోనూ మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

భావనశౌర్యను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయము ప్రాంగణంలో 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కై' అన్న నినాదంతో వైద్య, ఆరోగ్య శాఖలోని ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణపై డిఎంహెచ్ఓ డాక్టర్. కె.విజయలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్ వాడకం తగ్గించాలని, వాహనాల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సైకిల్ వాడకం పెంచాలని, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, సేంద్రీయ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు పండించాలని, కట్టెలు, బొగ్గు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ కవర్లను కాల్చకూడదని వాటిని రీసైక్లింగ్‌కు పంపాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఈ.అన్నపూర్ణ, ఎపిడమియాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, డెమో ఏ.జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డులు తొలగిస్తున్న పట్టణ ప్రణాళికా సిబ్బంది

ఫీజులు చెల్లించని ప్రకటనల బోర్డుల తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డు నిర్దేశిత మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు చెల్లించాలని, ఫీజులు చెల్లించని, అనుమతి లేని బోర్డులను తొలగిస్తామని జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్లు, బోర్డులు, ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమిషనర్ మాట్లాడుతూ అనధికార బోర్డులు, హోర్డింగ్‌లు నగరంలో ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిని ఎప్పటికప్పుడు తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ టీంను అందుబాటులో ఉంచాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, ఫీజులు చెల్లించని బోర్డులను గుర్తించి, వాటిని తొలగించాలన్నారు. నగరంలో ఇష్టానుసారం రోడ్లకు అడ్డుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, వాటిని కూడా తొలగించాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దష్ట్యా రోడ్ల విస్తరణ చేస్తున్నామని, కొందరు రోడ్ల మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కల్గిస్తున్నారన్నారు. రోడ్, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో రాజీపడ కూడదన్నారు. ప్రకటనల బోర్డుల నిర్వహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ సిటి ప్లానర్లు అజయ్‌కుమార్, మురళి, టిపిఎస్‌లు సువర్ణ కుమార్, లక్ష్మణ స్వామి, టిపిబిఓలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నష్టాన్ని యాప్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాలను ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో సచివాయ ఉద్యోగులు సక్రమంగా నమోదు చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ నుండి ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో వరద ప్రాంతాల్లో నష్టాల నమోదుపై వరద సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాలు నమోదు విధానాన్ని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపు ప్రభావిత ప్రాంతాల్లో వరద నీరు వలన బాధితులకు జరిగిన నష్టాలను యాప్‌లో నమోదు చేయటం ద్వారానే ప్రభుత్వం నుంచి పరిహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. వరద ప్రాభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి యాప్‌లో నిర్దేశించిన విధంగా బాధితుల ఇళ్ళకు, వస్తువులకు, వాహనాలకు, పశువులకు జరిగిన ఇతర నష్టాలను నమోదు చేయాలన్నారు. బాధితుల ఫోటోలతో పాటు, నష్టాలకు సంబంధించిన ఫోటోలు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాల నమోదును క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల షార్ సందర్శన

ప్రజాశక్తి-గుంటూరు

చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు. షార్ సందర్శనలో శ్రీహరకోటలోని 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. 1966 ఇస్రో ఆవిష్కరణ మొదలుకొని చంద్రయన్-3, ఇప్పటి వరకు మానవరహిత రాకెట్లు గురించి, రాబోవు డిసెంబర్ 2025 నాటికి మనవ వ్యోమగామిలను రాకెట్ ద్వారా పంపనున్న విషయాన్ని షార్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. షార్ సందర్శనకు బస్, వసతి, సౌకర్యం కల్పించిన చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ వద్ద విద్యార్థులతో శాంతమూర్తి

టిజెపిఎస్‌లో రేపు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

వరల్డ్ ఓజోన్ డేను పురస్కరించుకుని స్థానిక టిజెపిఎస్ కాలేజి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర కళాశాలల పరిధిలో ఈనెల 13న ఉదయం 11 గంటలకు కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో వక్తత్వం పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మేజర్ ఏ.బి.పి. మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పేర్లను డాక్టర్ జె. వి. సుధీర్ కుమార్ (జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి (98498 54221)కి తెలియచేయాలన్నారు. 'ఓజోన్ పొర క్షీణించే పదార్థాలను తగ్గించే నవీన పరిష్కారాలు' అనే అంశం పై 5 నిముషాలు తగ్గకుండా మాట్లాడాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులతో పాటుగా, పాల్గొన్న వారి అందరికి ప్రశంసాపత్రాలు ఉంటాయన్నారు. ప్రతి కళాశాల నుండి ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలియజేశారు.

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

సంఘం జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

రజకులపై జరుగుతున్న దాడుల నుండి వారిని రక్షించటానికి సామాజిక రక్షణ చట్టం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం జిల్లా మహాసభ స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో వేంపాటి చిన్న కొండయ్య (సీతయ్య) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు ముఖ్యవక్తగా హాజరై మాట్లాడుతూ 50 సంవత్సరాల వయసు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి సామాజిక పెన్షన్ మంజూరు, వారికి అవసరమైన వృత్తి పరికరాలు ఆదరణ ద్వారా ఇప్పించడం, సమస్యలను పరిష్కారానికి శాసనమండలి వేదికగా కృషి చేస్తానని అన్నారు. రజకులపై ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో దాడులు, వివక్షత, సాంఘిక బహిష్కరణ కొనసాగుతుందన్నారు. రజక వృత్తిదారులు విద్యాపరంగా అభివృద్ధి చెందటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని అన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘటింగా ఉండాలని, వీరనారి చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గాయని, దీంతో వృత్తిదారులు నగరబాట పడుతున్నారని, అపార్ట్‌మెంట్లలో చాలీ చాలని గదులలో ఉంటూ వాచ్‌మెన్లుగా పని చేస్తున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, ఇస్త్రీ చేసే వారికి 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, ఆదరణ పథకం ద్వారా పనిముట్లు ఇవ్వాలని కోరారు. అలాగే నివాస స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హైకోర్టు లాయర్ తుమ్మలపూడి శ్రీధర్ మాట్లాడుతూ రజక వృత్తిదారుల సమస్యలను న్యాయపరంగా వచ్చే ప్రతి అంశాన్ని అవసరమైన విధంగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వృత్తిదారుల సమస్యలపై పోరాడి విజయం సాధించిన ఏకైక సంఘం రజకవృత్తిదారుల సంఘమని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ అపార్ట్మెంట్ వాచ్మెన్ ఇస్త్రీదారులకు 8 గంటల పని విధానం అమలు జరుపకుండగా అపార్ట్మెంట్ యాజమాన్య కమిటీలు శ్రమ దోపిడీకి పాల్పడుతూ, వాచ్మెన్లపై అక్రమ కేసులు బనాయిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విధానాలకు వ్యతిరేకంగా అపార్ట్మెంట్ వాచ్మెన్ కమిటీదారులు వత్తిదారులు, రజక ఉద్యోగులు, కార్మికులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహాసభలకు ముందుగా సంఘం జెండాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య ఆవిష్కరించగా ,అమరజీవి చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి శాసనమండలి సభ్యులు లక్ష్మణరావు, అమరజీవి సత్తెనపల్లి రామకష్ణ చిత్రపటానికి ఈమని అప్పారావు పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభలో మహిళా శిశు సంక్షేమ శాఖ లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి, రజకవృత్తిదారుల సంఘం నాయకులు అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, బి.సుబ్బారావు, యం.వెంకట నర్సయ్య, పి.శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

రజక వృత్తిదారుల జిల్లా మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేస్తున్న బాస్కరయ్య

నూతన కమిటీ ఎన్నిక..

మహాసభలో సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండూరు వెంకటనరసయ్య అధ్యక్షులుగా, బి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా, వి.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా, వి.చిన్నకొండయ్య కోశాధికారిగా, పి.శ్రీనివాసరావు, పి.రాంబాబు, ఎ.సాంబశివరావు, యం.సుబ్బారావు, పి.కోటేశ్వరరావు, బి.కైలాసం, సుబ్రహ్మణ్యం తదితరులతో నూతన కమిటీ ఎన్నికైంది.